క్లుప్తంగా

ఓటరు చైతన్యంపై కళాజాత



కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

సుజాతనగర్: కలెక్టర్ ప్రియాంక అల ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల అధికారి శ్రీనివాస్ పర్యవేక్షణలో సుజాతనగర్‌లో పలుచోట్ల ఓటరు చైతన్యంపై శనివారం కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని, గ్రామంలో వందశాతం పోలింగ్ జరిగేలా సహకరించాలని, ప్రలోభాలకు గురికావద్దంటూ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాటల రూపంలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కొంపల్లి బాబు, కృపానందం, మూసా, నరేందర్, స్నేహ, నీలా, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

స్థూపం ఏర్పాటుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సాబీర్ పాషా

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో సీపీఐ నాయకుడు నల్లమాస్ తేజం స్థూపం ఏర్పాటుకు శనివారం సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ తేజం ఆశయాలను సాధిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గుగులోతు రామచందర్, అయిత నాగర్జున చారి, వెంకన్న, నరసింహారావు, నరేందర్, శ్రీలత, గంగా లచ్చమ్మ, జానయ్య, హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం సభను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లెందురూరల్: నవంబర్ 1న మండలంలోని మొట్లగూడెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు కంకణబద్దులు కావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఉమ్మడి చల్లసముద్రం గ్రామపంచాయతీ పరిధిలో పార్టీ ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా ఇల్లెందు మండలం నుంచే పార్టీ కార్యకర్తలు, అభిమానులు సభకు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ పూనెం లింగమ్మ, నాయకులు బండారు వెంకన్న, బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల వర్ధంతి సభలు నిర్వహించండి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

టేకులపల్లి: భూమికోసం భుక్తి కోసం భారత దేశ ప్రజల విముక్తి కోసం విప్లవోద్యమంలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకుంటూ నవంబర్ 1 నుండి 9 వరకు గ్రామ గ్రామాన అమరవీరుల వర్ధంతి సభలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు దుబాకుల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం బోడు గ్రామంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ... వర్ధంతి సభలు నిర్వహించాలని పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. అనేక త్యాగాలతో నిర్మించిన విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఎంతోమంది అమరులయ్యారని, వారిని స్మరిస్తూ సభలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష కార్యదర్శులు గుగులోతు రామచందర్, ఎట్టి నరసింహారావు, నాయకులు ఆర్.కోటిలింగం, సిరికొండ నాగేశ్వరరావు, వెంకటమ్మ, వినోద్, సమ్మయ్య, పాట్టయ్య, వెంకటరామ్, రవి పాల్గొన్నారు.

జీరో బజార్..

పెద్ద, చిన్న బజార్లలో సరుకులకు బిల్లులు ఇవ్వని వైనం

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- వ్యాపారులకు కలిసొచ్చిన దసరా
- నాణ్యతలేని, కాలం చెల్లిన సరుకుల అమ్మకాలు
- కానరాని అధికారుల తనిఖీలు



కొత్తగూడెంలోని పెద్దబజార్‌లోని వ్యాపార సముదాయాలు

నవభారత్: నాణ్యత లేని సరుకులు, బిల్లు ఇవ్వకుండా విక్రయిస్తూ జీరో దందాకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి కొందరు అక్రమార్కులు భారీగా గండి కొడుతున్నారు. కొత్తగూడెం పట్టణంలోని పెద్దబజార్‌లో రూ.కోట్లల్లో వ్యాపారం చేసేవారు వేలల్లో, లక్షల్లో వ్యాపారం చేసేవారు రూ.వందల్లో మాత్రమే విక్రయాలు చూపుతున్నారు. తనిఖీలు చేయాల్సిన అధికారులు మామూళ్లమత్తులో ఉన్నారనే విమర్శలు గట్టిగా ఉన్నాయి. దీంతో వ్యాపారాలు ఇష్టారాజ్యంగా కొనసాగిస్తున్నారు. మార్కెట్‌లో తీసుకునే కొన్ని సరుకులకు మాత్రమే నామమాత్రపు బిల్లులు చూపిస్తూ యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. మార్జిన్ ఎక్కువ వచ్చే నాసిరకమైన బ్రాండ్లను తెచ్చి రెట్టింపు ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కువ లాభాలు తెచ్చిపెట్టే కొన్ని బ్రాండ్ల సరుకులను నేటికీ మార్కెట్‌లో గుట్టుగా అమ్ముతున్నట్లు తెలుస్తుంది. ఇలా వినియోగదారులకు నాసిరకం, కాలం చెల్లిన సరుకులను అంటగడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగూడెంలో జీరో దందాకు కేరాఫ్‌గా మారిన పెద్దబజార్ వ్యాపారస్తులపై అధికారులు స్పందించి తనిఖీలు విస్తృతం చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఒరిజినల్ బిల్లులు ఇస్తున్నారా..?

కొత్తగూడెంలోని చిన్నబజార్, పెద్దబజార్‌లలో చాలా మంది వ్యాపారులు వినియోగదారులు కొనుగోలు చేసిన సరుకులకు బిల్లులు ఇవ్వడం లేదు. వ్యాపారులు సరుకులు కొనేవారికి జీఎస్టీతో కూడిన ఒరిజినల్ బిల్లులు ఇవ్వకుండానే మాయమాటలు చెప్పి దుకాణాల నుంచి వినియోగదారులను పంపిస్తున్నారు. ప్రభుత్వాన్ని, జనాలను మోసం చేస్తూ వ్యాపారాలు చేసే వారు జిల్లా కేంద్రంలో ఎక్కువ మంది తయారయ్యారనే ఆరోపణలున్నాయి. ఇలా జీరోదందా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

పండుగ రోజుల్లో దోపిడీ..!

పండుగ సమయాల్లో అనువుగా భావించి కొందరు వ్యాపారస్తులు, వినియోగదారులకు అర్థం కాకుండా రేట్లను పెంచి డిస్కౌంట్ల పేరుతో కాలంచెల్లిన సరుకులకు కొత్త స్టిక్కర్లు వేసి అమ్ముతున్నట్లు తెలుస్తోంది. మార్జిన్ ఎక్కువ వచ్చే నాసిరకమైన బ్రాండ్ల నూనెలు, సురుకులను తెచ్చి రెట్టింపు ధరలకు అమ్ముతూ దర్జాగా వ్యాపారస్తులు జేబులు నింపుకుంటు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా అధికారులు స్పందిచడంలేదని వినియోగదారులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు పెద్దబజార్‌లో జీరో వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తుల దుకాణాలపై నిఘా పెట్టి వ్యాపారాన్ని అరికట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

బిల్లు అడిగితే దాటవేత...



కొత్తగూడెంలోని మార్కెట్‌లో సరుకులు కొనుగోలు చేస్తే వ్యాపారులు డబ్బులు తీసుకుని వాటికి సంబంధించిన బిల్లులను మాత్రం ఇవ్వడం లేదు. ఇదేమని అడిగితే ఏవేవో కారణాలు చెబుతున్నారు. ఎక్కువ ధరకు సరుకులు మాత్రం అంటగడుతున్నారు. కాని బిల్లులకు సమాధానం ఇవ్వకుండా మౌనం వహిస్తున్నారు.

– బోగ సతీష్, వినియోగదారుడు, కొత్తగూడెం

హోల్‌సేల్ పేరిట మోసం



కొన్న సరుకులకు బిల్లులు ఇవ్వడంలేదు పెద్దబజార్ చిన్న బజార్ లలో అధిక ధరలకు వస్తువులు అమ్ముతున్నారు హోల్‌సేల్ పేరుతో దోపిడీ చేస్తున్నారు. కొన్న వస్తువులకు బిల్లులు ఇవ్వడం లేదు అధికారులు ఇప్పటికైనా స్పందించి అందరు వ్యాపారులు కొనుగోలుదారులకు బిల్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– దేవి బండిరాల, గృహిణి, కొత్తగూడెం

చందాలు, దందాలు కొనసాగనివ్వం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నియోజకవర్గంలో వ్యాపార వర్గాల వారిని చందాలు, దందాలు పేరుతో వేధిస్తున్న వారిని అడ్డుకుంటామని బీఎస్పీ కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్ వ్యాపారస్తులకు తెలిపారు. మన కొత్తగూడెం–మన కామేష్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పెద్ద బజార్, చిన్న బజార్ ప్రాంతాల్లో వ్యాపారస్తులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సభలు, సమావేశాల పేరుతో రాజకీయ పార్టీల నాయకులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని, చందాలు ఇవ్వని వారిపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. బీఎస్పీ గెలిస్తే ఇలాంటి వాటన్నింటికీ చరమగీతం పాడుతుందని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించి, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్‌రావు, సాయి, ఏడెల్లి మర్తమ్మ, వసుంధర, సందేల సందీప్, తాటిపాముల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి



ఊరేగింపు నిర్వహిస్తున్న బోయ కులస్తులు

టేకులపల్లి: బోయ కులస్తుల ఆరాధ్య దైవం వాల్మీకి జయంతి వేడుకలు మండలంలోని బోడు గ్రామంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మురికి సత్యనారాయణ, మీనుగు సురేష్, కేగర్ల శ్రీనివాస్, హనుమంతు, సాయి, సూర్యతేజ, నాగేందర్, జనార్ధన్, సతీష్, వీర లక్ష్మీ, శ్రీలక్ష్మీ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



రికార్డులు తనిఖీ చేస్తున్న సీడీపీఓ నిర్మలాజ్యోతి

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం, రాచబండ్లకోయగూడెం పోషణ్ వాటిక అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలాజ్యోతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నిర్మలాజ్యోతి రికార్డులు, రిజిష్టర్లు, స్టాక్ నిల్వలను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లలోని కిచెన్ గార్డెన్స్‌ను పరిశీలించారు. కిచెన్ గార్డెన్స్‌లో సేంద్రియ ఎరువులతో ఔషధ మొక్కలు, ఆకుకూరలు, కూరగాయాలతోపాటు, పండ్ల మొక్కలను పెంచాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లక్ష్మీ, శంకుతల, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సమావేశాన్ని జయప్రదం చేయాలి

జూలూరుపాడు: సోమవారం ఏన్కూర్‌లో జరిగే సీపీఐ వైరా నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశానికి పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులందరూ అధిక సంఖ్యలో హాజరుకావాలని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడులో ఆయన మాట్లాడుతూ... ఈ సమావేశానికి సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, రాష్ట్ర నాయకులు పాల్గొనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతా స్వరాజ్‌రావు, యల్లంకి మధు, ఎస్కే.నాగుల్‌మీరా, ఎస్కే.చాంద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారానికి అడ్వాన్స్ చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: ముఖ్యమంత్రి అల్పాహార పథకం కింద అల్పాహారం పెట్టేందుకు ప్రభుత్వం, విద్యాశాఖ మధ్యాహ్న భోజన కార్మికులకు అడ్వాన్స్‌లు చెల్లించాలని కోరుతూ శనివారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో డీఈఓ వెంకటేశ్వరచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల పిల్లలకు అల్పాహారం ఎలా పెట్టాలో, ఎవరూ ఇస్తారో అర్ధంకాని పరిస్థితుల్లో కార్మికులు, ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. పెండింగ్ బిల్లులు కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ, కోశాధికారి రామలక్ష్మీ, కార్యదర్శి సయ్యద్ ఉన్నారు.

పొంగులేటి జన్మదిన వేడుకలు

పాల్వంచ: మాజీ ఎంపీ, టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మెన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం స్థానిక పొంగులేటి క్యాంప్ ఆఫీస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జాలే జానకీ రెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్యలు కేక్ కట్‌చేశారు. పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, మండల అధ్యక్షులు కొండెం వెంకన్న గౌడ్, తుమ్మల శివారెడ్డి, చింతా నాగరాజు, బాలినేని నాగేశ్వరరావు, ఇజ్జగాని రవిగౌడ్, కట్టా సోమయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మండల కేంద్రంలోని పొంగులేటి, కోరంల క్యాంపు కార్యాలయంలో పొంగులేటి అభిమానులు, నాయకులు కేక్ కట్ చేశారు. నాయకులు పూనెం సురేందర్, ఇస్లావత్ రెడ్యా నాయక్, పోశాలు, బోడ మంగీలాల్, గడ్డం మధురెడ్డి, గంగరాజు, సర్ధార్, ప్రసాద్, చందర్, హరి, గంగారావు, శేఖర్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు లేళ్ల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి



పాల్వంచ: కేక్ కట్ చేస్తున్న నాయకులు

కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. భారీ ఎత్తున బాణా సంచాకాల్చి సంబరాలు జరుపుకున్నారు. కాకర్ల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ముత్తినేని రామయ్య, అల్లాడి లింగారావు, మిర్యాల వెంకన్న ఆధ్వర్యంలో శ్రీనివాస రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. లేళ్ల గోపాల్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రామిరెడ్డి, తెల్లబోయిన నరసింహారావు, హరీష్, రవి, పవన్, సురేష్, మంగు, ఉదారి రాము, రామక్రిష్ణ, ముత్తినేని గోపి, గోవర్ధన్, వాసిన్ని వీరయ్య పాల్గొన్నారు.



టేకులపల్లిలో..



జూలూరుపాడు: పడమటనర్సాపురంలో..

ప్రజాభీష్టం మేరకే మళ్లీ పోటీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

పాల్వంచ: సర్వే నివేదికలు బాగున్నాయని కేసీఆర్ ఆశీర్వదించి బీఫాం ఇచ్చారని, ప్రజాభీష్టం మేరకే ఈ సారి కూడా పోటీ చేస్తున్నానని కొత్తగూడెం నియోజక వర్గ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక పాత పాల్వంచలోని స్వగృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఇక ఇవే తన చివరి ఎన్నికలని స్పష్టం చేశారు. ఎక్కడికెళ్లినా తాను చేసిన అభివృద్ధి కనిపిస్తోందని, ఇటీవల ప్రచారానికి వెళ్లిన ప్రతీ గ్రామంలో ప్రజలు ఘన స్వాగతం పలికి మళ్లీ గెలిపిస్తామని ఆశీర్వదిస్తున్నారన్నారు. ఈ గడ్డ మీద పుట్టిన తాను ప్రాణం ఉన్నంత వరకు అభివృద్ధి చేస్తానన్నారు. తనపై సీఎం కేసీఆర్ పెట్టిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా గెలిపించాలని, ఇప్పటి వరకు తాను చేసిన అభివృద్ధి ఒక ఎత్తైతే, వచ్చే ఐదేళ్లలో మరింత అభివృద్ధి చేయడమే తనముందున్న లక్ష్యమన్నారు. ముర్రేడు వాగుపై బ్రిడ్జిలు, ప్రభుత్వ ఆస్పత్రుల విస్తరణ, రోడ్లు, రెండు మున్సిపాలిటీలను జంట పట్టణాలను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. వార్డు మెంబర్ స్థాయి నుండి నాలుగు సార్లు ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసే బాగ్యాన్ని ఇక్కడి ప్రజలు తనకు ఇవ్వడం పట్ల కృతజ్ఞతగా ఉంటానన్నారు.

కష్టాలు తెలిసిన నాయకుడు కేసీఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడని ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు శనివారం బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని గంగారం, చింతోనిచెలక, మేళ్లమడుగు, లచ్చగూడెం, కిష్టారం, కొప్పురాయి గ్రామ పంచాయతీల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో కోట్లాది రూపాయలతో గతంలో ఎవరూ చేయని అభివృద్ధి చేశానని, వచ్చే ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గ్రామాల్లో కోలాట నృత్యాలతో, పువ్వులు చల్లుతూ, హారతి ఇస్తూ హరిప్రియకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రక్షణ పక్షోత్సవాలు..



ఇల్లెందు: ప్రత్యేక సమావేశంలో అధికారులు



సింగరేణి(కొత్తగూడెం): వర్క్‌షాపు సిబ్బందికి ట్రోఫీ అందజేస్తున్న రక్షణ కమిటీ సభ్యులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా హాస్పిటల్‌లో 54వ రక్షణ పక్షోత్సవాలు శనివారం నిర్వహించారు. ఏరియా జీఎం జాన్ ఆనంద్, కన్వీనర్ వెంకటేశ్వరరావులు హజరై ఉద్యోగులతో రక్షణ పక్షోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం హాస్పిటల్‌లో రక్త పరీక్ష, ఎక్స్‌రే, పీఎంఈ రికార్డులు తనిఖీ చేశారు. ప్రతీ ఉద్యోగి రక్షణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రతీ ఉద్యోగి ఆరోగ్యకరమైన రికార్డ్స్‌ను సులభంగా కనిపెట్టేందుకు సింగరేణి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ అనే అప్లికేషన్ ద్వారా డిజిటల్ చేసిందని, దీనిపై ప్రతీ ఒక్కరు అవగాహన ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, ఇతర కమిటీ సభ్యులు రమేష్‌బాబు, హరిశంకర్, శేషగిరిరావు, మల్లారెడ్డి, విజయరాజు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఏరియా వర్క్‌షాపులో శనివారం 2021–22 సంవత్సరానికి సంబంధించిన వార్షిక 54వ రక్షణ పక్షోత్సవాలు వర్క్‌షాపు ఎస్ఈ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రక్షణ కమిటీ కన్వీనర్, ట్రాన్స్‌పోర్ట్ జీఎం ఎస్.దామోదర్‌రావు, ఏరియా జీఎం శాలెంరాజు, టీమ్ సభ్యులు వర్క్‌షాపులోని, ఏరియాలోని ఎలక్ట్రికల్ సేఫ్టీ, మెయింటనెన్స్‌ను పరిశీలించి, సిబ్బంది తీసుకుంటున్న రక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. వర్క్‌షాపు ఉద్యోగులు రక్షణపై తీసుకుంటున్న చర్యలు కమిటీ సూచించిన చర్యలకు అనుగుణంగా సిబ్బంది పనితీరును పరిశీలించిన సిబ్బందికి కమిటీ వారు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం(ఈఅండ్ఎం) దుర్గాప్రసాద్, వర్క్‌షాపు హెచ్ఓడీ శ్రీకాంత్, యాక్టింగ్ సేఫ్టీ ఆఫీసర్ శర్మ, బి.శంకర్, టి.అనిల్, ఉపేందర్‌బాబు, మధుకృష్ణ, వై.రవి, బాబుద్దీన్, గోపాల్, శ్రీమన్నారాయణ, సత్తార్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు కుమురం భీం మార్గదర్శి



నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

ఇల్లెందు: ఆదివాసీల హక్కులు, వారి రక్షణ కోసం పోరాడి అశువులు బాసిన కుమురం భీం నేటి తరం ఆదివాసీలకు మార్గదర్శిగా నిలిచాడని, ఆయన ఆశయ సాధనకు ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం పాటుపడాల్సిన తరుణం ఆసన్నమైందని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య అన్నారు. శనివారం కుమురం భీం వర్ధంతి సందర్భంగా కొత్త బస్టాండ్ సెంటర్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వట్టం ఉపేందర్, కన్నయ్య, ఈసాల రామచంద్రూ, పెనక మల్లయ్య, ఈసం కృష్ణ, మూతి భూపతి, రామారావు, మునేశ్వరరావు, కుమార్, సుధాకర్, రాములు, వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి



మానవహారంతో నాయకుల నిరసన

పాల్వంచ: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవికుమార్ అన్నారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.రహీం, ఎస్‌కె.నిరంజన్, పొదిలి తులసీ రాం, గట్టయ్య, రహమాన్, సోమలింగం, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం సా..గుతోంది!

- నత్తనడకన పెట్రాంచెలకస్టేజీ – మర్రిగూడెం రోడ్డు పనులు
- తేలిన కంకర, సిమెంట్.. లేస్తున్న దుమ్ముధూళి
- అదుపు తప్పి పడిపోతున్న వాహనదారులు

టేకులపల్లి: టేకులపల్లి మండలం పెట్రాంచెలక స్టేజీ– మర్రిగూడెం వరకు బీటీ రోడ్డు పనులు నత్తనడక సాగుతున్నాయి. దీంతో ఈ మార్గంలోని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 17 కిలోమీటర్లు ఉన్న సింగిల్ రోడ్డుని డబుల్ రోడ్డుగా మార్చేందుకు 2018–19 ఆర్థిక సంవత్సరంలో నక్సల్స్ ప్రభావిత నిధులు (ఎల్‌డబ్ల్యూఎస్) రూ.14.50 కోట్లు మంజూరయ్యాయి. సింగిల్ రోడ్డును పగులకొట్టి పనులు ప్రారంభించారు. గ్రామాల పరిధిలో 8 కిలోమీటర్ల వరకు రెండులైన్ల బీటీ రోడ్డు నిర్మాణం నాలుగేళ్ల క్రితమే పూర్తయింది. పెట్రాంచెలకస్టేజీ– కారేపల్లితండా వరకు 3 కిలోమీటర్లు, రామకృష్ణాపురం–మర్రిగూడెం(ఇల్లెందుమండలం) వరకు 6 కిలో మీటర్లు మొత్తం 9 కిలోమీటర్ల వరకు అటవీ ప్రాంతంలో ఉన్నదని రోడ్డు నిర్మాణాన్ని ఫారెస్టు శాఖ అడ్డుకున్న విషయం తెలిసిందే. ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు అక్కడ డబుల్ రోడ్ కాకుండా సింగిల్ రోడ్డు నిర్మించుకునేందుకు అటవీ శాఖ అనుమతినిచ్చింది. దీంతో ఎట్టకేలకు ఆగస్టు నెలలో బీటీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. మళ్లీ రోడ్డుని తవ్వి కంకర, సిమెంట్ మిక్సింగ్ వేశారు. బీటీ వేయడం ప్రారంభం కాకపోవడంతో తేలిన కంకర, దుమ్ము ధూళితో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే పలువురు అదుపు తప్పి కింద పడటంతో గాయాలు కూడా అయ్యాయి. ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్డుని త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కంకర తేలిన పెట్రాంచెలక స్టేజీ- కారేపల్లితండా రోడ్డు